క్లుప్తంగా

చిత్రలేఖనంలో విద్యార్థుల ప్రతిభ



ప్రతిభ కనబరిచిన విద్యార్థులు

మిర్యాలగూడ టౌన్ : విజయవాడలో స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్‌లో డ్రీమ్ ఆకాడమిలో ఇటీవల నిర్వహించిన 12వ జాతీయ చిత్రలేఖనం పోటీల్లో పట్టణానికి చెందిన విజయ్ డ్రాయింగ్ క్లాసెస్ విద్యార్థులు ప్రతిభ కనబరిచినట్లు చిత్రకారుడు యినుగుర్తి విజయ్ మంగళవారం తెలిపారు. సీనియర్ విభాగం నుంచి 9వతరగతి చదువుతున్న కె.లిఖిత, వి.నాగనందిని, కె.రిత్విక్‌రెడ్డి, బి.ఉజ్వల వేసిన చిత్రాలకు బంగారు పతకాలు, సబ్ జూనియర్ విభాగంలో 4వతరగతి విద్యార్థులు కె.మన్విత రెడ్డి, ఆధ్య, ఆర్య, ఆర్.రిత్విక వేసిన చిత్రాలకు వెండి బహుమతులతో పాటు మరో 26మంది ప్రతిభ కనబరిచినట్లు ఆయన తెలిపారు.

సౌరవిద్యుత్‌తో బిల్లు ఆదా

నిడమనూరు : కేంద్ర ప్రభుత్వం అందజేస్తున్న సూర్య ఘర్ యోజన పథకాన్ని సద్వినియోగం చేసుకొని విద్యుత్ బిల్లు ఆదా చేసుకోవాలని తెలంగాణ గ్రామీణ బ్యాంకు హెచ్ సీనియర్ మేనేజర్ శ్రీకాంత్ కోరారు. మంగళవారం మండలంలోని నారమ్మగూడెం బ్రాంచ్ పరిధిలోని ఖాతాదారులకు సూర్య ఘర్ యోజన పథకంలో ప్రభుత్వం నుంచి సబ్సిడీ, బ్యాంకు రుణాలను ఆయన వివరించారు. కార్యక్రమంలో నారమ్మగూడెం మాజీ సర్పంచ్ కొండా కృష్ణవేణి శ్రీనివాస్‌రెడ్డి, దుబ్బాకుల రాంరెడ్డి, బైరెడ్డి సత్యనారాయణరెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ బైరెడ్డి వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్లేస్‌మెంట్ డ్రైవ్‌లో 55మందికి ఉద్యోగాలు

మిర్యాలగూడ : పట్టణంలోని మినా మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో మంగళవారం నిర్వహించిన ప్లేస్‌మెంట్ డ్రైవ్‌లో 55మంది విద్యార్థినులకు ఉద్యోగ అవకాశాలు లభించినట్లు కళాశాల చైర్మన్ మహమూద్‌అలీ తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడారు. తమ కళాశాల విద్యా ప్రమాణాలకు అధిక ప్రాధాన్యం ఇస్తుందన్నారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ షెహ్లాబుతోల్, ప్రిన్సిపాల్ మురళి తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై సదస్సు



మాట్లాడుతున్న బ్రాంచ్ మేనేజర్ రమేష్

మిర్యాలగూడ : దామరచర్ల మండలంలోని బొత్తలపాలెం ఆదర్శ పాఠశాలలో ప్రిన్సిపాల్ పోతురాజు నరహరి ఆధ్వర్యంలో మంగళవారం ఆర్థిక అక్షరాస్యతపై సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో దామరచర్ల మండల ఎస్‌బీఐ బ్రాంచ్ మేనేజర్ ఎస్.రమేష్ పాల్గొని మాట్లాడారు. ప్రతిఒక్కరూ విధిగా తమ ఆదాయంలో కొంతభాగం బ్యాంకుల్లో పొదుపు చేసుకొనే అలవాటు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏరియా కోఆర్డి నేటర్ సంపత్, ఉపాధ్యాయులు లక్ష్మణ్‌రావు, బాబ్లు, యాదగిరి, రవికాంత్, విద్యాసాగర్, సతీష్, రాంబాబు, శ్రవణ్, సమీనా, సఫియా ఉన్నారు.

కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని వినతి

పెద్దవూర : మండలంలోని పులిచర్లలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని కోరుతూ రైతులు మంగళవారం తహసీల్దార్ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. గ్రామంలో ప్రభుత్వ కొనుగోలు కేంద్రం లేకనష్టపోతున్నామన్నారు. వారంలో కనీసం నాలుగు రోజుల పాటు సాగునీటిని విడుదల చేయాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో బీసీ సమాజ్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు బొడ్డుపల్లి చంద్రశేఖర్, రైతులు కంబంపాటి కృష్ణ, సత్యనారాయణ, వెంకటయ్య, చెన్నారెడ్డి, చిరంజీవి, కొండలు, రాములు, సైదులు ఉన్నారు.

చింతపల్లి వైన్స్‌లో చోరీ

చింతపల్లి : మండల కేంద్రంలోని ఓ వైన్స్‌లో గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. ఈ ఘటన మంగళవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. ఎస్ఐ యాదయ్య తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రంలోని దుర్గా వైన్స్‌లో పైభాగంలోని రేకులను దుండగులు తెల్లవారుజామున తొలగించి లోపలికి ప్రవేశించారు. దుకాణంలోని మద్యంతో పాటు నగదును ఎత్తుకెళ్లారు. ఈ సంఘటన స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. వైన్స్‌లో రూ.15వేల నగదుతో పాటు మద్యం బాటిల్లు చోరీ గురైనట్లు తెలిపారు.

ప్రభుత్వం పే రివిజన్ కమిషన్ అమలు చేయాలి

దేవరకొండ : తెలంగాణ ప్రభుత్వం పే రివిజన్ కమిషన్ అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు తాడిశెట్టి నరసింహ, అంకం చంద్రమౌళి అన్నారు. మంగళవారం పట్టణంలో నిర్వహించిన కార్యవర్గ సమావేశంలో వారు మాట్లాడారు. 2023 జూలై నుంచి అమలు చేయాల్సిన ప్రభుత్వ ఉద్యోగుల, పెన్షనర్స్ పే రివిజన్ కమిషన్ ఇంత వరకు అమలు చేయకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని అన్నారు. సమావేశంలో దామోదర్‌రెడ్డి, ఐజాక్, నారాయణరెడ్డి, లింగయ్య, తదితరులున్నారు.

శిథిల భవనం.. అందని వైద్యం

- భయంతో మధ్యాహ్నం వరకే వైద్యసేవలందిస్తున్న సిబ్బంది
- ఆపదొస్తే మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రే దిక్కు
- నూతన భవనంతో పాటు, వైద్య సిబ్బందిని నియమించాలని వేడుకోలు



శిథిలావస్థలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం



పెచ్చులు లేచిన పైకప్పు

నిడమనూరు : మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ) శిథిలావస్థకు చేరడంతో పాటు సరైన సిబ్బంది లేకపోవడంతో మండల ప్రజలకు వైద్యసేవలు అందడంలేదు. దీంతో రోగులు చేసేది లేక అనేక వ్యయప్రయాసలకు ఇబ్బందులు పడుతూ పెద్దాస్పత్రిని ఆశ్రయించాలని పరిస్థితి నెలకొంటుంది. సరైన వైద్యం అందించాలని వైద్య సిబ్బందిని అడుగగా భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరడంతో దీంట్లో ఉంటూ మేము వైద్యసేవలందించలేమంటూ వారు నిస్సాహాయతను వ్యక్తం చేస్తున్నారు. భవన శిథిలాస్థకు చేరడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని భయాందోళనతో వైద్యసిబ్బంది మధ్యాహ్నం వరకే విధులు ముగించుకోని వెళ్తున్న పరిస్థితి నెలకొంటుంది. అదే విధంగా ఆస్పత్రిలో ఉన్న సిబ్బంది విడత వారీగా విధులకు హాజరవుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. దీంతో ప్రభుత్వ వైద్యసేవలపై పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. 55వేలకు పైగా జనాభా ఉన్న మండలంలో ఎటువంటి వైద్యసేవలు అవసరం ఉన్నా మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి వెళ్లాల్సి వస్తోందని పలువురు వాపోతున్నారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఇద్దరు వైద్యులు ఉండాల్సి ఉండగా, ఒక పోస్టు ఖాళీగా ఉంది. దీంతో ఉన్నతాధికారుల సమావేశాలు, సెలవుల్లోకి వెళ్లినప్పుడు ఆస్పత్రి సిబ్బంది నుంచి డాక్టరు గారు లేరే అనే సమాధానం ప్రతిసారి వస్తుందని వాపోతున్నారు. దీంతో ఆపదలో వచ్చిన వారికి ప్రథమ చికిత్స అందని పరిస్థితి నెలకొంటుందని, రోగులు ఆస్పత్రికి రావడం తగ్గించారు. మండలంలో శిథిలావస్థకు చేరిన భవనం స్థానంలో కొత్త ప్రాథమిక ఆరోగ్యకేంద్ర భవనం పూర్తి కావొచ్చింది. ఆ భవనంలో శానిటేషన్, ప్లంబింగ్, విద్యుత్, వరండాలో ఫ్లోరింగ్, మరికొన్ని అంతర్గత పనులు చేపట్టాల్సిఉంది. ఆరు నెలల క్రితం డీఎంహెచ్ఓ భవనాన్ని పరిశీలించి పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించినా నేటి పనులు నత్తనడక సాగుతున్నాయని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కొత్త భవనం త్వరితగతిన పూర్తి చేయాలని, వైద్యసిబ్బంది సక్రమంగా విధులకు హాజరై మెరుగైన వైద్యసేవలందించేలా చూడాలని పలువురు కోరుతున్నారు.

వైద్యసేవలు అందడం లేదు



నాకు షుగర్ ఉండడంతో గాయమైన ఒక కాలును తీసివేశారు. ఆ కాలుకు డ్రెసింగ్ చేయించుకునేదుకు ఆస్పత్రికి వచ్చే సమయంలో ఎవరూ ఉండడంలేదు. పలుమార్లు ఆస్పత్రి చుట్టూ తిరగాల్సివస్తుంది. దీంతో తాను ఇబ్బంది పడుతున్నాను. వైద్యసిబ్బందిని పూర్తిస్థాయిలో నియమించి మెరుగైన వైద్య సేవలందించేలా చూడాలి.

– రామలింగయ్య, రిటైర్డ్ ఉద్యోగి

బీపీ, షుగర్ టెస్టులకే పరిమితి



ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో ఉన్న సిబ్బంది బీపీ, షుగర్ వైద్యసేవలు మాత్రమే అందిస్తున్నారు. రక్త పరీక్షలు ఇస్తే రోజుల తరబడి వేచి చూడాల్సివస్తోంది. దీంతో వ్యాధి నిర్ధారణ కాకపోవడంతో వైద్యం సకాలంలో అందక తీవ్ర ఇబ్బంది పడుతున్నాం. డాక్టర్లను, సిబ్బందిని నియమించి మంచి వైద్యం అందించాలి.

– చిత్రం నాగమ్మ, నిడమనూరు

ప్రతిరోజు విధులకు హాజరవుతున్నాను



ప్రస్తుతం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి సక్రమంగానే విధులకు హాజరవుతున్నాను. జిల్లా ఉన్నతాధికారుల సమావేశాలకు, శిక్షణా తరగతు లకు వెళ్లినప్పుడు ఆస్పత్రిలో స్టాఫ్ నర్స్ స్థాయి.. ఇతర సిబ్బంది విధులు నిర్వహిస్తుంటారు. త్రిపురారం వైద్యాధికారి ఇన్ సర్వీస్ ఉన్నత విద్యకు వెళ్లడంతో అప్పుడప్పుడు అక్కడికి వెళ్లి సేవలందిస్తుంటాను. నేను రెండు క్రితం వైద్యాధికారిగా వచ్చాను.

– డాక్టరు కేవీ అరవింద్ , వైద్యాధికారి

రైతులు ప్రభుత్వ మద్దతు ధర పొందాలి

- ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి

తిరుమలగిరి(నాగార్జునసాగర్) : రైతులు దళారులను ఆశ్రయించకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలకు ధాన్యాన్ని తీసుకువచ్చి మద్దతు ధరను పొందాలని ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి అన్నారు. మండలంలోని అల్వాలలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన మంగళవారం స్థానిక నాయకులతో కలిసి ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో ఏఎంసీ వైస్ చైర్మన్ కాంసాని చంద్రశేఖర్, తాజా మాజీ సర్పంచ్ పెంకీసు పాపిరెడ్డి, తాజా మాజీ ఎంపీటీసీ చిట్టెపు రామనర్సమ్మ, సాగర్‌రెడ్డి, రాంరెడ్డి, జానీ, శ్రీనివాస్‌రెడ్డి, ఏపీఎం నర్సింహ పాల్గొన్నారు.

త్రిపురారం : ప్రభుత్వ నిబంధనల ప్రకారం రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చి మద్దతు ధర పొందాలని డీఆర్‌డీఓ పీడీ శేఖర్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని పెద్దదేవులపల్లిలో ఐకేపీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించి ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ఏపీఎం అశోక్‌కుమార్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బుచ్చిరెడ్డి, అనుముల శ్రీనివాస్‌రెడ్డి, అంబటి సోమయ్య, ఆలంపల్లి జానయ్య, బిట్టు రవికుమార్, మర్ల చంద్రారెడ్డి, బహునూతుల నరేందర్, అంబటి రాము, సింగం వెంకటేశ్వర్లు, కృష్ణ, సైదులు పాల్గొన్నారు.

కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి



నిడమనూరు : ధాన్యం కొనుగోళ్లను ప్రారంభిస్తున్న జిల్లా రిజిస్ట్రార్ మురళీధర్



తిరుమలగిరి(నాగార్జునసాగర్) : కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి

హాలియా : ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని హాలియా ఏఓ సరిత అన్నారు. మండలంలోని యాచారంలో రైతు స్వయంకృషి ఫార్మర్స్ ప్రొడ్యూసర్ కంపెనీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. కేంద్రానికి రైతులు నాణ్యమైన ధాన్యం తీసుకరావాలని, తాలు లేకుండా చూడాలన్నారు. నిబంధనల ప్రకారం ఆరబెట్టి ప్రభుత్వ మద్దతు ధర పొందాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈఓ అరవింద్, డైరెక్టర్లు కాసాని జానయ్య, చెదురుపల్లి రాములు, సీఈఓ నర్సింహ, రైతులు తదితరులు ఉన్నారు.

ధాన్యం కొనుగోలుతో సంఘాలు బలోపేతం

నిడమనూరు : రైతు సంక్షేమానికి ఏర్పాటైన సహకార సంఘాలు ధాన్యం కొనుగోలుతో బలోపేతమయ్యాయని సహకార సంఘాల జిల్లా రిజిస్ట్రార్ మురళీధర్ అన్నారు. మంగళవారం మండలంలోని రాజన్నగూడెం, సూరేపల్లి గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ప్రతి ధాన్యం కొనుగోలు కేంద్రంలో రైతుల కోసం ఎలక్ట్రానిక్ వేయింగ్ మిషన్లు, టార్పాలిన్లు, తేమశాతం యంత్రాలు, ప్యాడీ క్లీనర్లను అందుబాటులో ఉంచాలన్నారు. కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ అంకతి సత్యం, పీఏసీఎస్ చైర్మన్ కేవీ రామారావు, సీఈఓ రాఘవరావు, వల్లభారెడ్డి, శివమారయ్య, శ్రీనివాస్‌రెడ్డి, రాంబాబు, మట్టారెడ్డి, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలోనే మిర్యాలగూడ ఆదర్శం కావాలి

- ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి



మిర్యాలగూడ టౌన్ : పారిశుద్ధ్య కార్మికులకు కిట్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే, సబ్ కలెక్టర్, డీఎస్పీ

మిర్యాలగూడ టౌన్ : తెలంగాణ రాష్ట్రంలోనే మిర్యాలగూడ మున్సిపాలిటీ ఆదర్శం కావాలని, అందుకు కార్మికులు, జవాన్లు సమన్వయంతో పనిచేయాలని, వేసవికాలాన్ని దృష్టిలో ఉంచుకుని నేటి నుంచి పారిశుద్ధ్య కార్మికులు ఒంటిపూట పనులు చేయాలని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో పారిశుద్ధ్య కార్మికులకు సబ్బులు, గ్లౌజ్‌లు, నూనే తదితర కిట్లును మిర్యాలగూడ్ సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్, డీఎస్పీ రాజశేఖర్‌రాజుతో కలిసి పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. పారిశుద్ధ్య కార్మికులు సమర్థంగా పనిచేసి మున్సిపాలిటీకి మంచి పేరు తీసుకురావాలన్నారు. ఎవరు పని చేయకున్నా స్వచ్ఛందంగా వెళ్లిపోవచ్చన్నారు. తాము పారిశుద్ధ్య పనులను తనిఖీ చేస్తామని, ఆ తనిఖీలో ఎలాంటి ఫిర్యాదులు ప్రజల నుంచి రావద్దన్నారు. పారిశుద్ధ్య కార్మికులకు ఏ సమస్య వచ్చినా తన దృష్టికి తీసుకురావాలన్నారు. వేసవిలో పట్టణ ప్రజలకు నీటి ఎద్దడి రాకుండా చూడాలన్నారు. సమావేశంలో సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్, మున్సిపల్ కమిషనర్ మహ్మద్ యూసుఫ్, మున్సిపల్ డీఈఈ వెంకన్న, టీపీఓ సోమయ్య, శానిటరీ ఇన్‌స్పెక్టర్ వెంకటరమణ, టీపీఎస్ అంజయ్య, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు నూలక వేణుగోపాల్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్ ఎస్‌కె జానీ తదితరులున్నారు.

ప్రమాదకరంగా ఉన్న స్థలాల పరిశీలన

మిర్యాలగూడ : పట్టణంలో రోడ్డు ప్రమాదాలకు ఆస్కారం ఉన్న పలు కూడళ్లను ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి మంగళవారం సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్, డీఎస్పీ రాజశేఖర్‌రాజుతో కలిసి పరిశీలించారు. పట్టణంలోని రాజీవ్‌చౌక్, తడకమళ్ల రోడ్డు, వైజంక్షన్లను పరిశీలించి కూడళ్లలో ఏర్పాటు చేసిన ఫౌంటేన్లు అధిక పరిమాణంలో ఉండడంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించకపోవడంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని అధికారులు, వాటి పరిమాణం తగ్గించి ప్రమాదాలు జరగకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. వారి వెంట మున్సిపల్ కమిషనర్ యూసుఫ్, నాయకులు తదితరులు ఉన్నారు.

‘పోషణ పక్షం’లో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలి

మిర్యాలగూడ టౌన్ : మున్సిపాలిటీలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఈ నెల 22 వరకు నిర్వహించే పోషణ పక్షం కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని మున్సిపల్ కమిషనర్ మహ్మద్ యూసుఫ్, మిర్యాలగూడ అర్బన్ సీడీపీఓ రేఖ మమత అన్నారు. మంగళవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో పోషణ పక్షం కార్యక్రమంపై నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. కార్యక్రమంలో మున్సిపల్ డీఈఈ వెంకన్న, ఆర్ఓ జ్ఞానేశ్వరీ, శానిటరీ ఇన్‌స్పెక్టర్ వెంకటరమణ, ఐసీడీఎస్ బ్లాక్ కో ఆర్డినేటర్ కవిత, అర్బన్ ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు పద్మ, లీలాకుమారీ, నజీమా బేగం, నాగమణి తదితరులున్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ పక్షం..

అంగన్‌వాడీ కేంద్రాల్లో నిర్వహించే పోషణ పక్షం కార్యక్రమం మంగళవారం అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రారంభమైంది. ముత్తిరెడ్డికుంటలో అంగన్‌వాడీ టీచర్లు బెజ్జం నాగమణి, అంజలిదేవి, రోహినాలతో పాటు జ్యోతి, స్వాతి పాల్గొన్నారు.

చింతపల్లి : మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో మంగళవారం పోషణ పక్షం కార్యక్రమంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు అధికారులు ఈ నెల 22వరకు నిర్వహించే పోషణ కార్యక్రమంపై చర్చించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రమాకాంత్ శర్మ, పీడీఓ సుజాత, సీడీపీఓ సక్కుబాయి, ఏపీఎం విజయలక్ష్మి, వైద్యాధికారి శ్రీదేవి పాల్గొన్నారు.

అడవిదేవులపల్లి : పోషణ పక్షం కార్యక్రమంలో గ్రామ స్థాయి అధికారులు కూడా భాగస్వాములు కావాలని దామరచర్ల ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీఓ చంద్రకళ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో వివిధ మండల స్థాయి అధికారులతో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈ నెల 22న వరకు ప్రతి అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలు, పిల్లలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రమేష్, ఎంఈఓ వరలక్ష్మి, సీహెచ్ఓ షాహిద్, ఏపీఎం శేషయ్య, ఆశ్రుతి, తదితరులున్నారు.



మిర్యాలగూడ టౌన్ : సమావేశంలో మాట్లాడుతున్న సీడీపీఓ రేఖ మమత

పోషకాహారంపై అవగాహన కలిగిఉండాలి

త్రిపురారం : ప్రతిఒక్కరూ పోషకాహారంపై అవగాహన కలిగి ఉండాలని ఐసీడీఎస్ సీపీడీఓ చంద్రకళ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఎంపీడీఓ కార్యాలయంలో దామరచర్ల ఐసీడీఎస్ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో వివిధ శాఖల మండల అధికారులు, అంగన్‌వాడీ సిబ్బందితో పోషణ అభియాన్ కార్యక్రమంలో భాగంగా పోషణ పక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీడీఓ చంద్రకళ మాట్లాడారు. ఈ నెల 22వరకు గ్రామాల్లో పోషణ, ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ విజయకుమారి, సూపరింటెండెంట్ దయాకర్ రెడ్డి, ఎంఈఓ రమావత్ రవి, త్రిపురారం పీహెచ్‌సీ డాక్టర్ మాలోతు సంజయ్, సూపర్ వైజర్ మల్లీశ్వరి, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

గర్భిణులు పోషకాహారం తీసుకోవాలి

కొండమల్లేపల్లి : గర్భిణులు, బాలింతలు పోషకాహారం తీసుకోవాలని సీడీపీఓ సరళ అన్నారు. మంగళవారం మండలంలోని కొత్తబావి, గుమ్మడవెల్లి, చిన్నఅడిశర్లపల్లి గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో నిర్వహించిన పోషణ పక్షం కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో ఏసీడీపీఓ సరళ, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ వరలక్ష్మి, వైద్యసిబ్బంది, గర్భిణులు, బాలింతలు ఉన్నారు.



త్రిపురారం : పోషణ పక్షం అవగాహన సదస్సులో పాల్గొన్న అధికారులు



పెద్దఅడిశర్లపల్లి : అవగాహన కల్పిస్తున్న అధికారులు

పెద్దఅడిశర్లపల్లి : పోషణ పక్షం– 2025 వారోత్సవాలను విజయవంతం చేయాలని మండల ప్రత్యేక అధికారి నాగమల్లేశ్వర్‌రావు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో అంగన్‌వాడీ సిబ్బందికి నిర్వహించిన అవగాహన సదస్సులో పాల్గొని మాట్లాడారు. సమావేశంలో ఎంపీడీఓ చంద్రమౌళి, ఎంఈఓ వెంకటయ్య, సీడీపీఓ ఉదయ, అంగన్‌వాడీలు ఉన్నారు.

చందంపేట : నేరెడుగొమ్ము మండల కేంద్రంలో ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం అధికారులు పోషణ పక్షం కార్యక్రమంలో భాగంగా గర్భిణులు, బాలింతలకు పోషకాహారంపై అవగాహన కల్పించారు. సమావేశంలో దేవరకొండ ప్రాజెక్ట్ అధికారిణి చంద్రకళ, ఎంపీడీఓ తస్నీరు ప్రవీణ్, తహసీల్దార్ ఉమాదేవి, ఎంపీఓ, ఏపీఓ నాగలీల, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శోభ, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

బహిరంగ సభను విజయవంతం చేయాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే రవీంద్రకుమార్, నాయకులు

దేవరకొండ : వరంగల్‌లో ఈ నెల 27న నిర్వహించే బీఆర్ఎస్ రజతోత్సవ బహిరంగ సభను విజయవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, దేవరకొండ మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ పిలుపునిచ్చారు. మంగళవారం పట్టణంలో సభకు సంబంధించిన పోస్టర్లను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. బహిరంగ సభలో ప్రభుత్వ వైఫల్యాలు, ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టనున్నట్లు తెలిపారు. ప్రజా పాలనలో రేవంత్‌రెడ్డి విఫలమయ్యారని అన్నారు. హైడ్రా పేరుతో పేద ప్రజల జీవితాలు సీఎం రోడ్డు మీదకు లాగారని ఆరోపించారు. బహిరంగ సభకు దేవరకొండ నుంచి అధిక సంఖ్యలో పార్టీ శ్రేణులు తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో లోక్యానాయక్, జనార్దన్‌రావు, రాజేష్, శంకర్‌నాయక్, రవీందర్, బొడ్డుపల్లి కృష్ణ, జానీబాబా, తదితరులున్నారు.

ముగిసిన తెలుగు రాష్ట్రాల స్థాయి ఎద్దుల పందేలు

తిరుమలగిరి(నాగార్జునసాగర్) : శ్రీరామనవమి సందర్భంగా మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన తెలుగు రాష్ట్రాల స్థాయి (జూనియర్స్) ఎద్దుల పందేలు సోమవారం అర్ధరాత్రి ముగిశాయి. ఈ పోటీల్లో మొత్తం ఎనిమిది జతలు పాల్గొన్నాయి. మొదటి బహుమతి రూ.60వేలు బాపట్లకు చెందిన అత్తోట శిరీషాచౌదరి ఎద్దులు, రెండో బహుమతి రూ.50వేలు గుంటూరు జిల్లాకు చెందిన సోమిశెట్టి అంజనేయులు ఎద్దుల జత, మూడో బహుమతి రూ.40వేలు బాపట్లకు చెందిన పమిడి సుష్మాంత్ బాబు ఎద్దుల జత, నాల్గొవ బహుమతి రూ.30వేలు గుంటూరు జిల్లాకు చెందిన యల్లం సాంబశివరావు ఎద్దుల జత, ఐదో బహుమతి రూ.20వేలు నల్లగొండ జిల్లా సూరేపల్లికి చెందిన అనంతరాములు జత, ఆరో బహుమతి రూ.15వేలు పల్నాడు జిల్లాకు చెందిన బండి సాహిత్‌శ్రీభవన్‌కు చెందిన జత, ఏడో బహుమతి రూ.10వేలు నల్లగొండ జిల్లా గాత్తండాకు చెందిన మన్యానాయక్ జత, ఎనిమిదో బహుమతి రూ.5వేలు పల్నాడు జిల్లాకు చెందిన గోపాలం బ్రహ్మయ్యకు చెందిన ఎద్దుల జత గెలుచుకున్నాయి. పోటీల్లో గెలుపొందిన వారికి నగదుతో పాటు షీల్డ్‌లు అందించి సన్మానించారు.

కోర్టు ఎదుట న్యాయవాదుల ఆందోళన



మిర్యాలగూడలో కోర్టు ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న న్యాయవాదులు

మిర్యాలగూడ టౌన్ : హైదరాబాద్‌లో న్యాయవాది ముజ్తాబ అలీపై జరిగిన దాడికి నిరసనగా మంగళవారం పట్టణంలోని కోర్టులో న్యాయవాదులు విధులు బహిష్కరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జి.రామకృష్ణారెడ్డి మాట్లాడారు. న్యాయవాదులపై దాడికి పాల్పడుతున్న వారిని కఠినంగా శిక్షించాలన్నారు. మరోసారి ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా న్యాయవాదుల రక్షణ చట్టాన్ని తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు ఎండీ ఇబ్రహీం, ప్రధాన కార్యదర్శి సకినాల వేలాద్రి, కోశాధికారి ఎం.పవన్‌కుమార్, న్యాయవాదులు గూడూరు శ్రీనివాస్, నేతి సత్యనారాయణ, లింగంపల్లి శ్రీనివాస్, విజయసారధి, కొంక వెంకన్న, భాస్కర్, రవినాయక్, వెంకట్‌రెడ్డి, జూనియర్, సీనియర్ న్యాయవాదులు ఉన్నారు.

వక్ఫ్ మార్చ్‌ను విజయవంతం చేయాలి

- కాంగ్రెస్ మైనార్టీ విభాగం వైస్ చైర్మన్ ఖలేదా సైపుల్లాహ్



సమావేశంలో మాట్లాడుతున్న ఖలేదా సైపుల్లాహ్

మిర్యాలగూడ : హైదరాబాద్‌లో ఈ నెల 13న జరిగే వక్ఫ్ మార్చ్‌ను విజయవంతం చేయాలని కాంగ్రెస్ మైనార్టీ విభాగం రాష్ట్ర వైస్ చైర్మన్ ఖలేదా సైపుల్లాహ్ అన్నారు. మంగళవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ముస్లింల మనోభావాలు దెబ్బతీసే విధంగా కేంద్ర ప్రభుత్వం వక్ఫ్ చట్టాన్ని తీసుకొచ్చిందని ఆరోపించారు. బిల్లుకు వ్యతిరేకంగా కాంగ్రెస్ చివరి వరకు పోరాడిందన్నారు. మెజార్టీ లేకపోవడంతో బిల్లు పాస్ అయిందన్నారు. బిల్లు రద్దు కోసం న్యాయస్థానం ద్వారా న్యాయపోరాటం చేస్తున్నామన్నారు. బీజేపీ ప్రభుత్వం కావాలని ముస్లింలకు సంబంధించిన ఆస్తులను కాజేసేందుకు కుట్ర పన్నిందన్నారు. వక్ఫ్ బిల్లు అందరి సమస్య అని, దీనిపై కులమతాలకు అతీతంగా పోరాడాలన్నారు. ఈ నెల 13న హైదరాబాద్ ట్యాంక్‌బండ్‌పై నిర్వహించే వక్ఫ్ మార్చ్‌కు ముస్లింలు అధిక సంఖ్యలో హాజరు కావాలన్నారు. కార్యక్రమంలో మైనార్టీ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహమ్మద్ సిరాజుద్దిన్, నల్లగొండ జిల్లా చైర్మన్ ఎంఏ.సలీం, ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు ఎంఏ.ఆరిఫ్, చాంద్‌పాషా, సల్మాన్, జాని, సమీఉల్లా, మహమ్మద్ మోసిన్ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కమిషనర్‌కు వినతి

మిర్యాలగూడ టౌన్ : పట్టణంలోని 32వవార్డులో పొదుపు సంఘం డబ్బులు వాడుకున్న ఎస్ఎల్ఎఫ్ -2 లీడర్ రమపై చర్యలు తీసుకోవాలని మంగళవారం మున్సిపల్ కమిషనర్ మహ్మద్ యూసుఫ్‌కు స్థానిక బంగారుగడ్డకు చెందిన మహిళా సంఘాల సభ్యులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఎస్ఎల్ఎఫ్ అధ్యక్షురాలు రమా సభ్యులకు చెందిన రూ.6లక్షల దుర్వినియోగం చేసిందని, ఎస్ఎల్ఎఫ్‌లో మొత్తం 17 స్వయం సహాయ సంఘాలు ఉన్నాయని, పట్టణంలోని యూనియన్ బ్యాంకులో ఎస్ఎల్ఎఫ్ ఖాతాను ప్రారంభించి నాలుగేళ్ల పాటు సంఘాల సభ్యులు రూ.6లక్షల వరకు పొదుపు చేసి ఇవ్వగా బ్యాంకు రుణాల కోసం బ్యాంక్‌కు రమ్మని పిలిస్తే ఆమె రావడం లేదని, సంఘానికి సంబంధించిన లెక్కలు చూపించడం లేదని కమిషనర్‌కు వివరించారు. ఈ విషయంపై వారం రోజుల్లో విచారణ జరిపించి అందుకు చర్యలు తీసుకుంటామని ఆయన అన్నారు.

ముస్తాబవుతున్న బుద్ధవనం

బుద్ధపూర్ణిమకు హాజరుకానున్న ప్రపంచ సుందరీమణులు

నాగార్జునసాగర్ : నాగార్జునసాగర్‌లో మే12వ తేదీన జరగనున్న బుద్ధపూర్ణిమకు బుద్ధవనం ముస్తాబవుతోంది. ఆ రోజున నాగార్జునసాగర్‌కు మిస్‌వరల్డ్ పోటీలకు సుందరీమణులు రానున్నారు. బౌద్ధ సంస్కృతి కలిగిన 30దేశాల వనితలు నాగార్జునసాగర్ సందర్శించనున్నారు. ఇక్కడ బుద్ధుడి పాదుకలు, మహాస్తూపం, జాతక పార్కు, మహాస్తూపం పైనుంచి 274 ఎకరాల్లో నిర్మాణమవుతున్న బుద్ధవనాన్ని పరిశీలిస్తారు. అదే రోజు సాయంత్రం బుద్ధజ్యోతి కార్యక్రమంలో పాల్గొంటారు. అందుకోసం బుద్ధవనంలోకి నీటి సరఫరా చేసేందుకు జలాశయం నుంచి రూ.1.05 కోట్లతో కొత్త పైపులైన్, మోటార్లను ఏర్పాటు చేశారు. రూ.35 లక్షలతో ఓవర్‌హెడ్ ట్యాంకు నిర్మిస్తున్నారు. రూ.10లక్షలతో సంప్ ఏర్పాటు చేశారు. రూ.42లక్షలతో 6 కాటేజీలను, రూ.8 లక్షలతో క్లాక్‌రూమ్‌ను అలాగే ఆధునీకరిస్తున్నారు. ఆయా పనులను ఉన్నతాధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. పనుల పరిశీలనకు కలెక్టర్ ఇలాత్రిపాఠి బుధవారం నాగార్జునసాగర్‌కు రానున్నట్లు తెలిసింది.



ఆధునీకరించిన కాటేజీ



బుద్ధవనంలో అశోకచక్రం, మహాస్తూపం